క్లుప్తంగా

కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

సిరిసిల్లటౌన్‌: కుంగ్‌ఫూ రాష్ట్రస్థాయి పోటీల్లో సిరిసిల్ల విద్యార్థులు పతకాలు సాధించారు. ఆదివారం కరీంనగర్‌లో ఆల్‌స్టైల్స్‌ కుంగ్‌ఫూ యూనిట్‌ ఆఫ్‌ తెలంగాణ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. సిరిసిల్లకు చెందిన మాస్టర్‌ వడ్నాల శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో 8, 10, 12, 14 సంవత్సరాల విభాగాల్లో బాలురు, బాలికలు పాల్గొని బంగారు, రజత పతకాలు సాధించారు. ఈసందర్భంగా ప్రణవి, హిరణ్మయి, తనుశ్రీ, జశ్విక, లక్ష్మీప్రసన్న, హరిహర, శ్రీతిక్‌, విశ్వాస్‌, వరుణ్‌తేజ్‌, అశ్విత్‌, రిషిత్‌, సాత్విక్‌, నరేశ్‌ను శ్రీనివాస్‌ తదితరులు అభినందించారు.

సిరిసిల్ల అర్బన్‌: కరీంనగర్‌లో ఇటీవల షావోలిన్‌ కుంగ్‌ ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్‌ లెవల్‌ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో స్థానిక విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా మంగళవారం కరాటే మాస్టర్‌ రామకృష్ణ, విద్యార్థులను ఎస్పీ అఖిల్‌ మహాజన్‌ అభినందించారు.

29న స్పాట్‌ అడ్మిషన్లు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని గురుకుల జూనియర్‌ కళాశాలలో ఈనెల 29న ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్‌ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ సంధ్యారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 19 సీట్లు, బైపీసీలో 11 సీట్లు, ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రెండు జిరాక్స్‌ సెట్లు, ఒరిజినల్‌ ధ్రువపత్రాలు అందించాలన్నారు.

ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ



బస్‌పాస్‌లు అందజేస్తున్న మల్లేశం

వేములవాడరూరల్‌: వేములవాడ మండలం నమిలిగుండుపల్లిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. మాజీసర్పంచ్‌ వంగపల్లి మల్లేశం 12 ఏళ్లలోపు విద్యార్థులకు మంగళవారం బస్‌ పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్‌.శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు రామస్వామి, పాఠశాల చైర్మన్‌ మర్రి అంజలి, మేక నరేశ్‌, చందం, నర్సయ్య, బండి పరశురాములు, కొత్తూరు సాగర్‌, చందు, సురేష్‌, ఆర్టీసీ సిబ్బంది రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



తహసీల్దార్‌ రామచంద్రంకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్‌ రామచంద్రంకు మండలానికి చెందిన జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి జర్నలిస్టుల సొంతింటి కల నెరవేర్చాలని కోరారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రతినిధులు ఎండీ మజీద్‌, ఎదురుగట్ల ముత్తయ్యగౌడ్‌, బాల్‌రెడ్డి, కొండ్లేపు జగదీశ్‌, సయ్యద్‌ షరీఫ్‌, బాబు, జి.రమేశ్‌, శ్రీనివాస్‌, మోహిజ్‌ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై అసత్య ప్రచారం



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

రుద్రంగి: కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులకు రైతు రుణమాఫీ చేస్తామని, సాంకేతిక సమస్యలుంటే వ్యవసాయ అధికారులను ఆశ్రయించాలని చెబుతుంటే బీఆర్‌ఎస్‌ నాయకులు మాత్రం వారి ఉనికిని కాపాడుకునేందుకు రుణమాఫీపై అసత్య ప్రచారం చేస్తువన్నారుని కాంగ్రెస్‌ మండల నాయకులు ఆరోపించారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌పై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమన్నారు. మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్‌ మండల ఉపాధ్యక్షుడు మనోహర్‌, గ్రామశాఖ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు తిరుపతి, నాయకులు తదితరులున్నారు.

రథంపై ఊరేగింపు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో శ్రీ సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవారం రథంపై గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌ మోతే లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య, శివాలయం చైర్మన్‌ సత్యనారాయణ, హనుమాన్‌ ఆలయం కమిటీ చైర్మన్‌ లద్దునూరి హన్మాండ్లు, నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజలింగం, సూర నర్సయ్య, పర్శరాములు, కిషన్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



ముస్తాబాద్‌: తండాకు వెళ్లే బురదరోడ్డుతో వాహన చోదకుల ఇక్కట్లు

చినుకుపడితే బురదే..



ఇల్లంతకుంట: బురదమయంగా తెనుగువానిపల్లి రోడ్డు

ముస్తాబాద్‌ మండలం సేవాలాల్‌తండా, ఇల్లంతకుంట మండలం తెనుగువానిపల్లె రోడ్లు వర్షం కురిస్తే బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ముస్తాబాద్‌ మండలం సేవాలాల్‌తండాకు తెర్లుమద్ది విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ నుంచి వెళ్లే రెండు కిలోమీటర్ల మట్టిరోడ్డుపై బురదతో అడుగుతీసి.. అడుగు వేయలేకపోతున్నారు. ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం తెనుగువానిపల్లెకు వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. వీరు ప్రతీ పనికి తమ జీపీ వంతడుపులకు వెళ్లాల్సిందే. వంతడుపుల, తెనుగువానిపల్లె మధ్య ఉన్న ఎలుకవానికుంట మత్తడి దూకితే రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతుంటాయి.

– ముస్తాబాద్‌/ఇల్లంతకుంట

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

వేములవాడఅర్బన్‌: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ టౌన్‌ సీఐ వీరప్రసాద్‌ అన్నారు. మంగళవారం పట్టణంలోని జ్యోతిబాపూలే పాఠశాల, జూనియర్‌ కళాశాలలో వేములవాడ టౌన్‌ పోలీస్‌, ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మహిళలు లైంగిక వేధింపులు, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై రమేశ్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ అంజమ్మ, సఖి కేంద్రం కో ఆర్డినేటర్‌ రోజా, విద్యార్థులు ఉన్నారు.

తంగళ్లపల్లి: మహిళలు లైంగిక వేధింపులు, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై దాస సుధాకర్‌ అన్నారు. మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, నేరెళ్ల రెసిడెన్షియల్‌ పాఠశాలలో విద్యార్థినులకు జిల్లా పోలీస్‌, సఖి కేంద్రం, షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాలబాలికలు గుడ్‌ టచ్‌ బ్యాడ్‌ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సుస్మిత, గిరిజన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ రెహానా, నేరెళ్ల గురుకుల ప్రిన్సిపాల్‌ రాధ, జిల్లా షీటీం ఇన్‌చార్జి ప్రమీల, లీగల్‌ కౌన్సిలర్‌ అంజలి, డిహబ్‌ కోఆర్డినేటర్‌ రోజా పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలోని హైస్కూల్‌, మోడల్‌స్కూల్‌, కేజీబీవీ పాఠశాలతో పాటు, ఆనంద్‌ విద్యానికేతన్‌ హైస్కూల్‌లో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌ శాఖ, పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, గుడ్‌టచ్‌, బ్యాడ్‌ టచ్‌ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మోతీరామ్‌ మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. బాలరక్షభవన్‌ ఎల్‌సీపీఓ విజయలక్ష్మి, శ్రీనివాస్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ నిర్మల, చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ సునిత, మోడల్‌స్కూల్‌ ప్రిన్సిపాల్‌ నిమ్మల సుధాకర్‌, కేజీబీవీ ఎస్‌వో పద్మ తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ అర్బన్‌: మాట్లాడుతున్న వేములవాడ టౌన్‌ సీఐ వీరప్రసాద్‌

చందుర్తి: మహిళల భద్రతే లక్ష్యమని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై ప్రమీల అన్నారు. షీటీం, ఐసీడీఎస్‌ శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, చందుర్తి, జోగాపూర్‌ ఉన్నత పాఠశాలల్లో సైబర్‌ క్రైం, ఆన్‌లైన్‌ మోసాలు, మహిళ భద్రతపై అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో బాపు, ఐసీడీఎస్‌ సూపర్‌ వైజర్‌ శంకరమ్మ, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

గంభీరావుపేట: దమ్మన్నపేట మోడల్‌ స్కూల్‌లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై రామ్మోహన్‌ మాట్లాడుతూ..విద్యార్థినులు సమస్యలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, డయల్‌ 100 తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ రమేశ్‌, ఉపాధ్యాయులు సుమలత, నరసింహారాజు, ప్రభావతి, పావని, చంటిబాబు, మహాలక్ష్మీ, సురేందర్‌, రేణుక పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైంగిక నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై శ్రీకాంత్‌ గౌడ్‌ లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి వివరించారు. ఐసీడీఎస్‌ ప్రాజెక్టు ఇల్లంతకుంట సూపర్‌వైజర్‌ చంద్రకళ గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌ గురించి వివరించారు. ఉపాధ్యాయురాలు మంజుల, సోషల్‌ వర్కర్‌ సంపత్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సామాన్యులకు చేరాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న కార్యవర్గ సభ్యులు

చందుర్తి: కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలకు అందేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొక్కు దేవేందర్‌ యాదవ్‌ కోరారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్‌ ఆధ్వర్యంలో మంగళవారం మండలకేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. మారుమూల పల్లెలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్‌, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి సిర్రం తిరుపతి, సహ ఇన్‌చార్జిలు గంగరాజు, అంబాల శ్రీకాంత్‌, నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై సమావేశం

బోయినపల్లి: సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల ఆంజనేయులు పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ప్రతి బూత్‌నుంచి 200 మందితో సభ్యత్వాలు చేయించాలని పేర్కొన్నారు. ఉదారి నర్సింహాచారి, ఎడపల్లి పర్శరాం, కొనుకటి హరీశ్‌, బోగోజి గంగాధర్‌చారి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, మెరుపుల గంగాధర్‌, అశోక్‌, నిఖిల్‌ తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కరీంనగర్‌ జిల్లా బీజేపీ పార్టీ ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ.. మండలంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండల పార్టీ కన్వీనర్‌ దేశెట్టి శ్రీనివాస్‌, పార్టీ సీనియర్‌ నాయకులు అశోక్‌, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతుభరోసా అమలుచేయాలి

తంగళ్లపల్లి: ప్రభుత్వం రూ.2లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసాను ఎలాంటి షరతులు లేకుండా అమలుచేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రాళ్లపేటలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన వారికి రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు 50శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందని మిగతా వారికి చేయలేదని ఆరోపించారు. రుణమాఫీ జరిగిన రైతులకు మళ్లీ కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్‌ ముందు ధర్నా చేస్తున్న కార్యదర్శులు

సిరిసిల్ల అర్బన్‌: ఇల్లంతకుంట మండలం కిష్టరావు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల జిల్లా కార్యదర్శులు అన్నారు. పట్టణంలోని కలెక్టరేట్‌ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. కారకులైన అధికారులను వెంటనే సస్పెండ్‌ చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు గర్జనపల్లి, రంగంపేట గ్రామాల్లో మండల ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్‌ చిరంజీవి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వీర్నపలిలో 41 మందికి, రంగంపేటలో 33 మందికి, గర్జనపల్లి 23 మందికి వైద్య పరీక్షలు చేశారు. హెల్త్‌ సూపర్‌ వైజర్‌ పద్మ , చైతన్య ,ఏఎన్‌ఎమ్‌ లు సుజాత, కీర్తి, మంజుల, ఇందిర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి

వేములవాడ: వేములవాడ టౌన్‌ కమిటీ ముస్లింల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అధ్యక్షుడు అక్రమ్‌పాషా అన్నారు. మంగళవారం ఆయన ప్రధాన కార్యదర్శి షాహిద్‌పాషా, కోశాధికారి ముషాహీద్‌తో కలిసి పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. 30 మందితో కూడిన కమిటీని విడుదల చేశారు. గౌరవాధ్యక్షులుగా సయ్యద్‌ లాయక్‌పాషా, ఉపాధ్యక్షులుగా మొహమ్మద్‌ అజీమ్‌, అబ్దుల్‌ రజాక్‌, షబ్బీర్‌అలీ, సయ్యద్‌ ఉమర్‌, ముఖ్య సలహాదారులుగా ఎండీ అమానుల్లాఖాన్‌, ఎంఏ మన్నాన్‌, ఎంఏ కలీంపాషా, షేక్‌ బాబుస్‌, జాయింట్‌ సెక్రటరీలు, ఆర్గనైజింగ్‌ సెక్రటరీలు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

● ఆర్డీవో సమావేశం

వేములవాడఅర్బన్‌: వేములవాడ తహసీల్దార్‌ కార్యాలయంలో ఆర్డీవో రాజేశ్వర్‌ అసెంబ్లీ నియోజకవర్గ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమం 2025లో భాగంగా ఈనెల 20 నుంచి బూత్‌స్థాయి అధికారులతో ఇంటింటి సర్వే ప్రారంభం అయిందన్నారు. ఇందులో కొత్త ఓటర్ల నమోదు, ఓటరు కార్డులో సవరణలు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు పోలాస నరేందర్‌, నిత్యానందరావు, రామస్వామిగౌడ్‌, కడారి రాములు, తహసీల్దార్‌ మహేశ్‌ కుమార్‌, ఎలక్షన్‌ డీటీ శ్రావణ్‌ కుమార్‌ తదితరులు ఉన్నారు.

● గంజాయి విక్రేత అరెస్టు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని హరిదాస్‌నగర్‌ గ్రామ శివారులోని అర్బన్‌ పార్క్‌ వద్ద గంజాయి విక్రేతను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ వివరాలు ప్రకారం.. వేములవాడ అర్బన్‌ మండలం చీర్లవంచకు చెందిన వేముల సాయికృష్ణ (24) కొంతకాలంగా గంజాయికి బానిసయ్యాడు. పట్టణంలోని గుర్తు తెలియని భక్తుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. హరిదాస్‌నగర్‌లో శివారులో సాయికృష్ణ గంజాయి విక్రయించేందుకు వచ్చి పోలీసులకు చిక్కాడు. అతని వద్దనుంచి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. కాగా మరో గంజాయి నిందితుడు పరారైనట్లు తెలిసింది. అతని కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

● నేడు భూమిపూజ

ముస్తాబాద్‌: మండలకేంద్రంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో చేపట్టే గోదాం నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌ బుధవారం భూమిపూజ చేయనున్నారని చైర్మన్‌ అన్నం రాజేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్‌, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌, కాంగ్రెస్‌ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరవుతారని, రైతులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

● విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

వీర్నపల్లి: మండలంలోని లాల్‌సింగ్‌ తండాలో సేవాలాల్‌ మహారాజ్‌ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి వన్‌పల్లి మాజీ ఎంపీటీసీ బాణోత్‌ పద్మ హాజరయ్యారు. సేవాలాల్‌ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎంపీటీసీ పద్మ దంపతులను సత్కరించారు. గిరిజన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● రాగిజావ కప్పుల వితరణ

సిరిసిల్లటౌన్‌: జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌, భూపతినగర్‌ ఎంపీపీఎస్‌ పాఠశాలల్లో చిన్నారి విద్యార్థులకు రాగిజావ కప్స్‌ వితరణ చేశారు. సిరిసిల్లకు చెందిన జక్కని అక్షర పుట్టినరోజు సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు రాగిజావ తాగే కప్పులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజారత్నం,లక్ష్మిరాజం , ఉపాధ్యాయులు జక్కని గీత భిక్షపతి శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

● తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కుకునూరు రాజయ్య మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. రాజయ్యకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె దేవవ్వ తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు.

● అనాథ వృద్ధురాలి అంతిమ సంస్కారం

గంభీరావుపేట: మండలకేంద్రంలోని 'మా' అనాథ వృద్ధుల ఆశ్రమంలో ఐదేళ్లుగా జీవనం సాగిస్తున్న నిజామాబాద్‌ జిల్లాకు చెందిన రత్నమ్మ అనే 90ఏళ్ల వృద్ధురాలు అనారోగ్యానికి గురై మంగళవారం మృతిచెందింది. ఆశ్రమం నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్‌ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు.

● పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన చిలువేరు గంగాప్రసాద్‌ గుండెపోటుతో మృతిచెందగా బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం పరామర్శించారు. ఇక్కడ నాయకులు పదిర్ల పర్శరాములుగౌడ్‌, ఎడ్ల సందీప్‌, లక్ష్మణ్‌, శివరామకృష్ణ తదితరులున్నారు.

● కమిటీ ఎన్నిక

గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేటలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా భూంపల్లి హన్మండ్లు, కో కన్వీనర్‌గా జక్కుల నవీన్‌, పల్నాటి దేవరాజు, రాజు, గుమ్మడి శ్రీనివాస్‌, పోతుల నర్సింలు, బంటు సురేశ్‌, కార్యవర్గ సభ్యులుగా బైండ్ల శేఖర్‌, గుమ్మడి దేవరాజు, ప్రశాంత్‌, బంటు నవీన్‌, పల్నాటి నవీన్‌, సురేశ్‌, పిట్ల వెంకటేశ్‌, కార్తీక్‌, నక్క రాజు, మేకల రాజు, రామస్వామి, రాజు ఎన్నికయ్యారు.



చందుర్తి: మండలంలోని పలుగ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లపై తారు వేశారు. మండల శివారులోని హన్మాజీపేట నుంచి ఎన్గల్‌, బండపల్లి మీదగా బావుసాయిపేట గ్రామాలకు రోడ్లు దెబ్బతినడంతో మళ్లీ తారు వేయడంతో రోడ్డు ఎత్తు పెరిగింది. తారు వేసి రెండేళ్లు గడుస్తున్నా ఇరువైపులా మొరం పోయక వదిలేశారు. వాహనాలు ఎదురెదురుగా వస్తే రోడ్డు దిగాలన్నా.. తిరిగి ఎక్కాలన్నా అనువుగా లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు రోడ్డుకు సమాంతరంగా మొరం పోయాలని వాహనదారులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి: కిరణ్‌కుమార్‌, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఇన్‌చార్జి చందుర్తి 9440818862

వాట్సప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్‌ నంబర్‌ : 9440243048, 9705346626

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



పోస్టర్లతో విద్యార్థులు

గంభీరావుపేట: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్‌ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ విజయలక్ష్మీ అన్నారు. కళాశాలలో ఉమెన్‌ ఎంపవర్‌మెంట్‌ సెల్‌ కో ఆర్డినేటర్‌ వాణి ఆధ్వర్యంలో మంగళవారం మహిళా సమానత్వ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అమలు చేస్తున్న చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు పలు పోస్టర్లను ప్రదర్శించారు. కళాశాల అకాడమిక్‌ కో ఆర్డినేటర్‌ ప్రభాకర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ ధర్మపురి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్‌ ఆంజనేయులు, టాస్క్‌ కో ఆర్డినేటర్‌ శ్రావణ్‌, విష్ణు, మనోహర్‌, శ్రీనివాస్‌, మహేశ్‌, కృష్ణప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్‌ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్‌	02	1,680
భీమేశ్వర సదన్‌ ఏసీ	10	1,344
భీమేశ్వర సదన్‌ సూట్స్‌	02	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్‌	02	2,800
నందీశ్వర కాంప్లెక్స్‌ ఏసీ	04	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	08	560
నందీశ్వర సూట్స్‌	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌	19	448
పార్వతీపురం స్పెషల్‌	13	672
పార్వతీపురం సాధారణ	12	336

- వేములవాడ

హనుమాన్‌ చాలీసా పారాయణం

వేములవాడ: హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న హనుమాన్‌ చాలీసా పారాయణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 50వ హనుమాన్‌ చాలీసా పారాయణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహికంగా 51సార్లు హనుమాన్‌ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో హిందు ఉత్సవ సమితి సభ్యులు, హనుమాన్‌ దీక్ష సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌ చాలీసా పారాయణంలో భక్తులు

కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం

తంగళ్లపల్లి: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌ లభించడంతో తంగళ్లపల్లి బీఆర్‌ఎస్‌ మహిళా నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ పడిగెల మానస మాట్లాడుతూ, కవితకు బెయిల్‌ రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. సిరిసిల్ల మాజీ ఎంపీపీ పూసపెల్లి సరస్వతి, మాజీ సర్పంచ్‌ కోడం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్‌ ఇవ్వడం పట్ల బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య మంగళవారం హర్షం వ్యక్తంచేశారు.

సిరిసిల్ల అర్బన్‌: బీఆర్‌ఎస్‌ నాయకురాలు కవితకు బెయిల్‌ రావడంతో పట్టణంలోని కట్ట మైసమ్మ ఆలయంలో బీఆర్‌ఎస్‌ విద్యార్థి విభాగం నాయకులు మంగళవారం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ నాయకుడు కంచర్ల రవి గౌడ్‌ మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఇల్లంతకుంట: బీఆర్‌ఎస్‌ నాయకురాలు కవితకు బెయిల్‌ రావడంపై మండల బీఆర్‌ఎస్‌ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బుర్ర సూర్య గౌడ్‌ హర్షం వ్యక్తంచేశారు. కేటీఆర్‌ సేన ఇన్‌చార్జి నాయకులు రాములు యాదవ్‌, ఉపాధ్యక్షులు మహేశ్‌ ,సమీర్‌, తిరుపతి, సతీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

అవ్వ దొరికింది



అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బాలవ్వ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన లింగన్నపేట బాలవ్వ అనే వృద్ధురాలు రెండ్రోజుల క్రితం తప్పిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ప్రత్యక్షమైంది. వివరాల్లోకి వెళ్తే... వృద్ధురాలు బాలవ్వ ఇటీవల తన కూతురును చూసేందుకు హైదరాబాద్‌ వెళ్లింది. సిటీ చూసేందుకని బయటకు వెళ్లి తప్పిపోయింది. అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు వివరాలు అడిగారు. తాను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన వ్యక్తిగా తెలిపింది. తమ సర్పంచ్‌ పేరు నేవూరి వెంకట్‌రెడ్డి అని చెప్పడంతో పోలీసులు స్థానిక ఎస్సై రమాకాంత్‌కు ఫోన్‌ చేసి, వృద్ధురాలి ఫొటోను వాట్సాప్‌ చేశారు. వెంకట్‌రెడ్డి స్థానిక పోలీసుల సహకారంతో అంబర్‌పేట పోలీసులతో మాట్లాడారు. పూర్తి వివరాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు వెంటనే ఠాణాకు వెళ్లి బాలవ్వను ఇంటికి తీసుకొచ్చారు. అంబర్‌పేట పోలీసులతో పాటు మాజీ సర్పంచ్‌ వెంకట్‌రెడ్డికి బాలవ్వ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వేములవాడ: పట్టణంలోని న్యూ అర్బన్‌కాలనీలోని వడ్డెర కులానికి చెందిన దండుగుల అశోక్‌ (40) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. దహన సంస్కారాలకు వేములవాడ ట్రస్టు సభ్యులు రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు. ట్రస్ట్‌ సభ్యులు, తదితరులున్నారు.